
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 సిద్దిపేట
గురువారం 4 జూలై 2024



ఖేడ్‌కు పుణే రోడ్డు ప్రమాద మృతదేహాలు
● అశ్రునయనాలతో ముగిసిన అంత్యక్రియలు
● నివాళులర్పించిన నాయకులు, ప్రజాప్రతినిధులు
● కారు టైరు పేలడంతోనే ప్రమాదం 5

పదవులకు విరామం

● నేటితో 'స్థానిక' ప్రజాప్రతినిధుల పదవీకాలం పూర్తి
● జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలకు వీడ్కోలు
● మళ్లీ నిలిచేదెవరో.. గెలిచేదెవరో
● తాజా పరిణామాలతో తగ్గనున్న బీఆర్‌ఎస్ ప్రాబల్యం
● ముగ్గురు జడ్పీ చైర్‌పర్సన్లతోపాటు వారిదే సంఖ్యా బలం



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూలై 3 : నేటితో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పదవీకాలం పూర్తవుతున్నది. ఐదేళ్ల గడువు ముగిసిన నేపథ్యంలో వారందరికీ వీడ్కోలు సమయం ముంచుకొచ్చింది. ఇప్పటికే ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా సన్మానాలు, సత్కారాలు జరుగుతున్నాయి. ఐదు సంవత్సరాల కాలంలో నిధులు, విధుల విషయంలో ఇబ్బందులు తలెత్తినా.. వాటన్నింటినీ అధిగమించారు. ప్రస్తుతం పదవిని కూడా వీడే పరిస్థితి రావడంతో వారంతా ఆవేదనకు లోనవుతున్నారు. ఇదిలా ఉంటే స్థానిక సంస్థల్లో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల బలమే ఎక్కువగా ఉంది. ఇప్పటికే ఆ పార్టీ రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయినప్పటికీ పాలనా వ్యవహారాల్లో మాత్రం ప్రభావం చూపిస్తున్నారంటే అందుకు స్థానిక సంస్థల సంఖ్యా బలమే కారణం. నేడు ఆ బలం కూడా తగ్గుతుండడంతో గులాబీ శిబిరాన్ని ఒకింత ఆందోళనకు గురిచేస్తోంది.

వచ్చే ఎన్నికలు రసవత్తరమే..

స్థానిక సంస్థలకు సంబంధించి రాబోవు ఎన్నికలు రసవత్తరంగా జరుగుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. 2019వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీ హవా కొనసాగింది. అప్పటికే ఆరు నెలల ముందు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అధికారం దక్కించుకుంది. దీంతో సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో మెజార్టీ శాతం వారే విజయం సాధించారు. అయితే గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మూడో స్థానంలో నిలిచారు. మెదక్‌లో బీజేపీ అభ్యర్థి, జహీరాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందారు. దీంతో ఈ రెండు పార్టీల ప్రభావం ఉమ్మడి జిల్లాలో ఉంటుందనే అంచనాలు నెలకొన్నాయి. బీసీ కులగణన తదితర కారణాలతో ఎన్నికలు ఆలస్యంగా నిర్వహించినా మూడు పార్టీలూ నువ్వానేనా అన్నట్లుగానే పోరాడాల్సి వస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాల వారీగా 2019 స్థానిక ఎన్నిక బలాలు

సంగారెడ్డి జిల్లా

పార్టీ	ఎంపీపీలు	జడ్పీటీసీలు	ఎంపీటీసీలు
బీఆర్‌ఎస్	18	20	183
కాంగ్రెస్	06	05	92
బీజేపీ	00	00	01
స్వతంత్ర	01	00	15
మొత్తం	25	25	291

సిద్దిపేట జిల్లాలో

పార్టీ	ఎంపీపీలు	జడ్పీటీసీలు	ఎంపీటీసీలు
బీఆర్‌ఎస్	23	22	153
కాంగ్రెస్	00	01	29
బీజేపీ	00	00	04
సీపీఐ	00	00	01
స్వతంత్ర	00	00	42
మొత్తం	23	23	229

మెదక్ జిల్లాలో

పార్టీ	ఎంపీపీలు	జడ్పీటీసీలు	ఎంపీటీసీలు
బీఆర్‌ఎస్	18	17	117
కాంగ్రెస్	02	02	44
బీజేపీ	00	01	00
స్వతంత్ర	01	00	28
మొత్తం	20	20	189

బీఆర్‌ఎస్ ఆధిపత్యంపై ప్రభావం

ప్రస్తుతం సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు సంబంధించిన జడ్పీ చైర్‌పర్సన్లు బీఆర్‌ఎస్ పార్టీకి చెందినవారే. ఆయా జిల్లాల్లో జడ్పీటీసీల సంఖ్యా బలం ఆ పార్టీకి అనుకూలంగా ఉన్నందునే వారు ఎన్నికయ్యారు. ఇక ఎంపీటీసీల పరంగానూ మెజార్టీ సీట్లు గెలుచుకున్న నేపథ్యంలో ఎంపీపీల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. గడిచిన ఐదేళ్లలో జరిగిన జడ్పీ సమావేశాలు, మండల సమావేశాల్లో వీరు పూర్తి ఆధిపత్యం సాధించారు. నిధుల కొరత ఉన్నప్పటికీ తీర్మానాలు, ఇతర పాలనా వ్యవహారాల్లో తమదైన ప్రభావం చూపించారు. అయితే నేటితో పదవీకాలం పూర్తవుతున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులంతా పదవీచ్యుతులు కానున్నారు. ఫలితంగా స్థానిక సంస్థల్లోనూ వారి బలం పూర్తిగా తగ్గిపోనున్నది.

అందని గౌరవ వేతనాలు

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ప్రతీనెల గౌరవ వేతనాలు అందించాలి. కానీ గడిచిన ఎనిమిది నెలలుగా వీరికి గౌరవ వేతనాలు అందడం లేదు. గత ప్రభుత్వం టంఛన్‌గా ప్రజాప్రతినిధుల ఖాతాల్లో జమ చేసింది. గత అక్టోబరులో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో గౌరవ వేతనాలకు బ్రేక్ పడింది. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన కొద్ది రోజులకే పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. ఈ కారణాలతోనే గౌరవ వేతనాలకు సంబంధించిన నిధులు విడుదల చేయనట్లుగా తెలుస్తోంది. కాగా జడ్పీ చైర్‌పర్సన్‌కు ప్రతీనెల రూ.లక్ష, జడ్పీటీసీ, ఎంపీపీలకు రూ.13 వేలు, ఎంపీటీలకు రూ.5వేల చొప్పున గౌరవ వేతనాన్ని నిర్ణయించారు. ఇదిలా ఉంటే నేటితో పదవీకాలం పూర్తవుతున్న సందర్భంగా పెండింగ్‌లో ఉన్న తమ గౌరవ వేతనాలనైనా మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.



కోహెడలో ప్రజాప్రతినిధులతో మంత్రి పొన్నం ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అభివృద్ధి చేస్తేనే ప్రజాప్రతినిధులకు గుర్తింపు

● రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కోహెడ, జూలై 3 : గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసినప్పుడే ప్రజాప్రతినిధులకు గుర్తింపు లభిస్తుందని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం కోహెడ మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఎం పీపీ కొక్కుల కీర్తి సురేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఐదేళ్ల పదవీ కాలం ముగియడంతో జడ్పీటీసీ నాగరాజు శ్యామల మధుసూదన్‌రావు, ఎంపీపీ కొక్కుల కీర్తి సురేష్, వైస్ చైర్మన్ తడకల రాజిరెడ్డి, ఎంపీటీసీలకు ఆయన శాలువాలు కప్పి మెమెంటోలతో సత్కరించి మాట్లాడారు. పదవులు తాత్కాలికమని, పదవీ కాలంలో చేసిన మంచి పనులు, ప్రజాసేవే శాశ్వతమని వివరించారు. రాజకీయాల్లో ప్రజాజీవితంలో ఏదీ శాశ్వతం కాదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా కొన్ని కార్యక్రమాలు పూర్తి చేయవచ్చన్నారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని చెప్పారు. ఐదేళ్లు ప్రజలకు సేవ చేయడానికి తపనపడ్డ మీరంతా మళ్లీ ప్రజాప్రతినిధులుగా అవకాశం రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కష్టపడిన వారందరికీ మరోసారి అవకాశాలు వస్తాయన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యే, మంత్రి అయ్యానని, హుస్నాబాద్ నియోజకవర్గం ప్రజల గౌరవం దక్కేలా పనితీరు ఉంటుందన్నారు. సమీక్షలు జరిపి తాగునీటి సమస్య తలెత్తకుండా మూడున్నర కోట్లు మంజూరయ్యేలా కృషి చేసినట్లు చెప్పారు. కోహెడ మండలం తంగళ్లపల్లిలో 25 ఎకరాల్లో నాలుగు గురుకులాలు ఒకే దగ్గర ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వివరించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు మండలంలో ఉన్న వివిధ గ్రామాల సమస్యలు విద్యా, వైద్యం, వ్యవసాయం, తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీరాంమూర్తి, ఎంపీడీవో కృష్ణయ్య, తహసీల్దార్ సురేఖ, ఎంపీటీసీలు, వివిధశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కరీంనగర్ జిల్లాలో కలపాలి మంత్రికి వినతి..

కోహెడ, హుస్నాబాద్, అక్కన్నపేట, బెజ్జంకి మండలాలను కరీంనగర్ జిల్లాలో కలపాలని ఎంపీటీసీ ఖమ్మం స్వరూప, బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు మంత్రి సానుకూలంగా స్పందించారు.

మంత్రి పొన్నం సమక్షంలో..

హుస్నాబాద్‌టౌన్: హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాజుల భగవాన్ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోలి వెంకటనారాయణ, పాము రాజన్న, వేముల వెంకటరమణ, సాదుల యాదగిరి, వీరస్వామి, రాజు పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి మంత్రి పొన్నం ప్రభాకర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమశాఖ మంత్రిగా పద్మశాలి వర్గాల సమస్యలను ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిష్కరిస్తామన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ చేనేత కార్మికులకు జౌళిశాఖ ద్వారా మౌళిక సదుపాయాలు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మల్లేశం, ఎండీ హసన్ తదితరులున్నారు.

పాలన చేతకాక.. ప్రతిపక్షాల మీద కేసులు

● గెలుపోటములు సహజం.. మళ్లీ వచ్చేది మనమే
● స్థానిక సంస్థల ఎన్నికల్లో దగ్గరుండి గెలిపించుకుందాం
● మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు


దుబ్బాక, జూలై 3 : పాలన చేతకాక.. ప్రతిపక్షాల మీద కేసులు పెడుతున్నారని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బుధవారం దుబ్బాకలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదవికి విరమణ ఉంటుంది కానీ ప్రజాసేవకు కాదన్నారు. ప్రజల మధ్య ఉన్న నాయకులకు ఏదో రూపంలో అవకాశాలు వస్తాయని సూచించారు. ప్రజల మధ్య ఉంటూ, పార్టీని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మళ్లీ వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇక ఏడునెలల్లోనే గ్రామాలు చెత్తకుప్పలుగా మారాయని, పారిశుధ్య కార్మికులకు ఏడునెలల నుంచి జీతాలు కరువయ్యాయని తెలిపారు. ట్రాక్టర్లు నడిపేవారు లేరని, దోమలకు మందుకొట్టేవారు లేరన్నారు. ఈ ప్రభుత్వం నిద్రపోతుందంటూ ఆయన ఎద్దేవా చేశారు. పాఠశాలలకు విద్యుత్‌బిల్లులు చెల్లించలేకపోవడంతో కొన్నింటికి కనెక్షన్లు తొలగించారన్నారు. రైతులు బలవన్మరణానికి పాల్పడుతున్నారని, హత్యలు కూడా జరుగుతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం సొంత జిల్లాలోనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తుచేశారు. ప్రతిపక్షాల మీద కేసులు పెట్టడం తప్పితే ప్రజాపాలన మీద ధ్యాసలేదని ధ్వజమెత్తారు. జూన్ మొదటి వారంలోగా రైతుబంధు రైతుల అకౌంట్‌లో పడేవని ఇప్పటివరకు రైతుబంధు ఊసే లేదన్నారు. సరిగ్గా రెండు వేల పింఛన్ కూడా ఇవ్వడం లేదన్నారు. కాళేశ్వరం నీళ్లు వస్తాయని, కాలువలు వస్తాయనే ధైర్యం రైతుల్లో ఉండేదని, కేసీఆర్ నీళ్లు ఇస్తారనే ధైర్యం ఉండేదన్నారు. ఇప్పుడు కాలువల నీళ్లు వస్తాయోలేదో తెలియని పరిస్థితిలో వరితుకాలు కూడా వేయడంలేదన్నారు. స్థానిక సంస్థల్లో ధైర్యంగా కదలాలని, తప్పకుండా మనమే జెండా ఎగరేస్తామన్నారు. కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీఎమ్మెల్సీ ఫారుక్‌హుస్సేన్, తాజామాజా జడ్పీటీసీ రోజాశర్మ, బక్కివెంకటయ్య, మనోహర్‌రావు, ఆర్.రాజమౌళి, వెంకటనర్సింహారెడ్డి, పలువురు పాల్గొన్నారు.



సిద్దిపేటరూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీశ్‌రావు

అందరినీ కాపాడుకుంటూ సముచిత స్థానం

సిద్దిపేట రూరల్ : ఐదేళ్ల గ్రామాల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నో సేవలు అందించారు. పదవిలో ఉన్నప్పుడు మీరు చేసిన సేవలే శాశ్వతంగా గుర్తింపునిస్తాయి. పదవికి విరమణ కానీ ప్రజాసేవకు విరమణ లేదని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు ఎర్రన్నగుట్టపై ఆర్‌డబ్ల్యూఎస్ గెస్ట్‌హౌజ్ వద్ద సిద్దిపేటఅర్బన్, సిద్దిపేటరూరల్, నారాయణరావుపేట, నంగునూరు మండలాల జడ్పీటీసీలు, ఎంపీటీసీలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పదవిలో ఉన్నా లేకపోయినా అందరినీ కాపాడుకుంటూ సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. ప్రజాప్రతినిధులుగా మీ హయాంలోనే కాళేశ్వరం జలాలతో సాగునీటి కల సాకారమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు కష్టాలు మొదలయ్యాయని, కాలిపోయిన మోటార్లు, ఇన్వెర్టర్ల కాలం వచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో పచ్చటి చెట్లతో స్వాగత తోరణాలు స్వాగతం పలికేవని.. నేడు చెత్త కుప్పలు స్వాగతం పలుకుతున్నాయని చెప్పారు. ఒకప్పుడు కాలంతో పనిలేకుండా 24 గంటల విద్యుత్ సరఫరా, కాళేశ్వరం నీరు అందుతాయనే నమ్మకం రైతుల్లో ఉండేదని, నేడు పంట వేద్దామంటే నీళ్లు లేవు.. రావు అనే ఆందోళనలో రైతులు ఉన్నారన్నారు. గ్రామాల్లో 7 నెలలుగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు అందడం లేదన్నారు. కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ ఊసేలేదన్నారు. సర్కారు దవాఖానల్లో మందులు లేక బయట మెడికల్ దుకాణాలకు చీటీలు రాస్తున్నారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలలకే ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, ప్రస్తుతం ప్రజలెవరూ వారిని నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రతి ఒక్కరూ ప్రజలలో ఉండి సేవ చేస్తే మళ్లీ మీరే గెలిచి ఉన్నత పదవులు పొందే అవకాశం ఉందని చెప్పారు.



దుబ్బాక ఎంపీపీ కొత్త పుష్పలతను సన్మానిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ హుస్సేన్

50 కుక్కలు హతం

● ఆలస్యంగా వెలుగులోకి..
● సీపీకి వీధి జంతు సంరక్షణ సమితి ప్రతినిధి ఫిర్యాదు
● ముగ్గురు కార్మికులను విధుల నుంచి తొలగింపు

దుబ్బాక, జూలై 3: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట వార్డులో నాలుగురోజుల క్రితం వీధికుక్కలను చంపారంటూ వీధి జంతురక్షణ సమితి ప్రతినిధి గౌతమ్ సిద్దిపేట సీపీకి బుధవారం ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ కమిషనర్ రమేష్‌కుమార్ ముగ్గురిపై వేటు వేశారు. లచ్చపేట వార్డులో కుక్కల స్వైరవిహారంతో మున్సిపల్ సిబ్బంది వాటిని చంపడానికి సోమవారం విషప్రయోగం చేశారు. సుమారు 50 వీధి కుక్కలు చంపడంపై సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం జరిగింది. వెంటనే స్పందించిన వీధిజంతు సంరక్షణ సమితి ప్రతినిధి గౌతమ్ బుధవారం సిద్దిపేట సీపీని కలిసి ఫిర్యాదు చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా దుబ్బాక ఎస్ఐని ఆదేశించారు. ఫిర్యాదును అందుకున్న మున్సిపల్ కమిషనర్ రమేష్‌కుమార్ మున్సిపాలిటీ తాత్కాలిక సిబ్బంది ముగ్గురిని విధుల నుంచి తొలగించారు. ఈ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గంగరాజు తెలిపారు.

ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులు వేగవంతం చేయాలి

● కలెక్టర్ మనుచౌదరి

నంగునూరు, జూలై 3: నంగునూరు మండలం నర్మెట్టలో రూ.300కోట్లతో చేపడుతున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను పరిశీలించారు. సంబంధిత కాంట్రాక్టర్లు ఫ్యాక్టరీ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ తమకు కేటాయించిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలన్నారు. జిల్లాలో ఆయిల్‌పామ్ పంట దిగుబడి ప్రారంభమైనందున ఫ్యాక్టరీ నిర్మాణం వేగంగా పూర్తి చేస్తే రైతులకు లాభం చేకూరుతుందన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణ తీరును దశలవారీగా, ఆయిల్ తయారయ్యే విధానం, ఎక్కడెక్కడ ఏఏ నిర్మాణాలు జరుగుతున్నాయనే పూర్తిసమాచారాన్ని మ్యాప్ ద్వారా ఆయిల్‌ఫెడ్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు ఓవర్ హెడ్ ట్యాంక్, ల్యాబ్ స్టోరేజ్ బిల్డింగ్, ఫాం పౌండ్ నిర్మాణాలు పూర్తయినట్లు తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా పిల్లర్ల దశను వేగంగా పూర్తి చేయాలని, లేదంటే వానలు కురిసి నీరు నిల్వడం వల్ల పనులు ఆగిపోయే ఉందని అధికారులకు కలెక్టర్ సూచించారు. అనంతరం ఆయన కొబ్బరి మొక్కను నాటారు. కలెక్టర్ వెంట జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, టీజీ ఆయిల్‌ఫెడ్ అధికారులు ఉన్నారు.

'గ్రోత్' మేళాను సమన్వయంతో నిర్వహించాలి

సిద్దిపేట అగ్రికల్చర్: 0-5 సంవత్సరాలలోపు పిల్లల బరువు, ఎత్తు మేళాను సంబంధిత శాఖలు సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ మనుచౌదరి మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రోత్ మేళాపై మహిళా, శిశు సంక్షేమశాఖ, పంచాయతీ, గ్రామీణ అభివృద్ధి, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.



నర్మెట్టలోని ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

నర్సాపూర్ అభివృద్ధికి హెచ్‌ఎండీఏ ప్రత్యేక కార్యాచరణ

● రైతుల ఆమోదంతో భూములను తీసుకునేందుకు కసరత్తు
● హెచ్‌ఎండీఏ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ

నర్సాపూర్, జూలై 3 : హైదరాబాద్ మహానగరానికి కేవలం 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న నర్సాపూర్ పట్టణంలో హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో భూములు సేకరించి అభివృద్ధి చేసేందుకు కసరత్తు మొదలుపెట్టారు. వాణిజ్య, వ్యాపార అవసరాలకు తగ్గట్టు తీర్చిదిద్దేందకు సిద్ధం అవుతున్నారు. అందులో భాగంగా స్థానిక రైతుల అభిప్రాయం తీసుకోవడానికి సమావేశాలు నిర్వహిస్తున్నారు. మహానగరానికి అతీసమీపంలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే నర్సాపూర్ పట్టణం అభివృద్ధికి నోచుకోలేదు. దీనికి ప్రధాన కారణం ఈ ప్రాంతం ఎక్కువగా అటవీ ప్రాంతాన్ని కలిగి ఉండటమే అని చెప్పవచ్చు. నర్సాపూర్ ప్రాంతాన్ని కూడా వ్యాపార, వాణిజ్య పరంగా అభివృద్ధి చేసేందుకు హెచ్‌ఎండీఏ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఈ ప్రాంతంలో భూసేకరణ చేసి ఆ భూములను అభివృద్ధి చేసి విక్రయించాలనే ఆలోచన చేస్తుంది.

రైతుల ఆమోదం ఉంటేనే..

ఆర్డీవో కార్యాలయంలో హెచ్‌ఎండీ డిప్యూటీ కలెక్టర్ విజయకుమారి, నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి నేతృత్వంలో బుధవారం పలువురు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ విజయకుమారి మాట్లాడుతూ వ్యవసాయం చేయని పట్టా భూములను సేకరించి అభివృద్ధి చేయాలని హెచ్‌ఎండీఏ నిర్ణయించినట్లు చెప్పారు. 50 ఎకరాకు తక్కువ కాకుండా ఎన్ని ఎకరాలైన ఒకే చోట సేకరించి ఆ భూములను డెవలప్‌చేసి వ్యాపార, వాణిజ్య అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడమే హెచ్‌ఎండీఏ ధ్యేమన్నారు. రైతుల ఆమోదం ఉంటేనే వారి భూములను తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం సంబంధిత రైతులకు ఆ భూములలో వాటా కూడా ఇవ్వనున్నామని తెలిపారు. తద్వారా రైతులు కూడా ఆర్థికంగా లాభపడడంతో పాటు పెద్దపెద్ద వాణిజ్య వ్యాపారాలు ఏర్పడి ఈ ప్రాంతంలోని వారికి మరింత ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. అదేవిధంగా పర్యాటకపరంగా కూడా నర్సాపూర్ ప్రాంతం ఎంతో అనువుగా ఉన్నందున పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. రైతులు సహకరించి అభివృద్ధికి అవకాశమున్న భూములు హెచ్‌ఎండీఏకు ఇవ్వడానికి సహకరించాలని డిప్యూటీ కలెక్టర్ సూచించారు.

పట్టా భూములతో సమానంగా ఇవ్వాలి

హెచ్‌ఎండీఏ సేకరించే భూములకు రైతులకు ఇచ్చే వాటాలో పట్టా, అసైన్డ్ భూములకు చాలా తేడా ఉందని, పట్టా భూములతో సమానంగా వాట ఇవ్వాలని పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, కౌన్సిలర్లు రామచందర్, యాదగిరితో పాటు రైతులు అధికారులను కోరారు. ఇందుకు డిప్యూటీ కలెక్టర్ స్పందిస్తూ ఈ విషయమై నిర్ణయం తీసుకునే అధికారం తనకు లేదని ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.



నర్సాపూర్‌లో రైతులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న హెచ్‌ఎండీ డిప్యూటీ కలెక్టర్,ఆర్డీవో




కోహీర్‌లోని ఓ పొలంలో వర్షాలు లేక మొలకెత్తని పత్తి పంట, సోయాపంటకు డ్రిప్ ద్వారా నీటిని అందిస్తున్న రైతు

వాన అలక.. మొలవని మొలక..!

● వాడుతున్న మొక్కజొన్న, సోయా పత్తి పంటలు
● ఆందోళనలో రైతన్నలు

కోహీర్, జూలై 3: ప్రారంభంలో పలకరించిన వర్షాలు ఇలా వచ్చి... అలా వెళ్లిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జూన్‌లో వర్షాలు బాగా కురుస్తాయనే ఆశతో మండలంలోని చాలా గ్రామాల్లో రైతులు సోయా, మొక్కజొన్న, కంది తదితర పంటల విత్తనాలను ఎత్తుకున్నారు. జూన్ 7, 8, 9వ తేదీల్లో అడపాదడపా వర్షాలు కురిశాయి. అనంతరం వర్షాలు కనుమరుగుకావడంతో విత్తనాలు మొలకెత్తడం లేదు. మొలకెత్తిన కొన్ని పొలాల్లో మొలక దశలో ఉన్న పంటలు ఎదుగుదల లేక వాడు ముఖం పడుతున్న పరిస్థితి ఏర్పడింది. పొలంలో నాటినం విత్తనాలు ఎలాగైనా బతికించుకోవాలని ఆశతో మండలంలోని చాలా గ్రామాల్లో రైతులు డ్రిప్ ద్వారా వర్షాధార పంటలకు నీటిని అందిస్తున్నారు. వారం పదిరోజులు వర్షాలు కురవకపోతే రైతులు పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



కాంతయ్య (ఫైల్)

నారాయణరావుపేట, జూలై 3: కారు, ఎక్సెల్ ఢీకొని బుధవారం రాత్రి ఓ వ్యక్తి మృతిచెందాడు. నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామానికి చెందిన నక్క కాంతయ్య(57) గుర్రాలగొంది అంగడిలో కూరగాయలు అమ్ముకుని తిరిగి ఇంటికి వస్తున్నాడు. జక్కాపూర్ గ్రామ శివారుకు రాగానే సిరిసిల్ల నుంచి సిద్దిపేట వైపునకు వస్తున్న కారు ఢీకొని కాంతయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. కాంతయ్యను 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, నలురుగు కూతుళ్లు ఉన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి..

జహీరాబాద్, జూలై 3: జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి బుధవారం మృతిచెందాడని జహీరాబాద్ రూరల్ ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. కొత్తూర్(బి) గ్రామ సమీపంలోని నారింజ బ్రిడ్జి వద్ద ఈనెల 1న గుర్తు తెలియని వ్యక్తి మద్యం తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో గ్రామస్థులు 108కు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. వారు జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడని తెలిపారు. మృతుడికి సంబంధించిన వారు ఉంటే రూరల్ పోలీసులను సంప్రదించాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

ఝరాసంగంలో వ్యక్తి అదృశ్యం

ఝరాసంగం, జూలై 3: ఝరాసంగంలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ పట్టణంలోని మాణిక్‌ప్రభు వీధికి చెందిన చిట్టింపల్లి దిలీప్(36) కుటుంబసభ్యులతో కలిసి ఈనెల 26న పెళ్లికి ఝరాసంగం వచ్చాడు. కుటుంబసభ్యులు అదేరోజు రాయికోడ్‌లోని మహబత్‌పూర్‌లో మరో పెళ్లికి వెళ్లి జహీరాబాద్‌కు వచ్చారు. అయితే దిలీప్ మాత్రం రాలేదు. ఆందోళన చెందిన కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దిలీప్ తల్లి సుబ్బమ్మ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఏడుపాయల ఈవోగా కృష్ణప్రసాద్



బాధ్యతలు స్వీకరిస్తున్న కృష్ణప్రసాద్

పాపన్నపేట, జూలై 3: పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గామాత ఆలయ ఈవోగా కృష్ణప్రసాద్ నియామకమయ్యారు. బుధవారం ఆయన ఏడుపాయల దేవాదాయశాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జి ఈవోగా పనిచేసిన వినోద్‌రెడ్డిని వేములవాడ ఏసీగా నియమించడంతో ఆయన స్థానంలో కృష్ణప్రసాద్‌ను నియమిస్తూ దేవాదాయ ధర్మాదాయశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బాలాగౌడ్, డైరెక్టర్లు ఈవోను ఘనంగా సన్మానించారు.

విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి

● మరొకరికి గాయాలు




మృతిచెందిన చంద్రశేఖర్, చంద్రశేఖర్(ఫైల్)

జోగిపేట, జూలై 3: విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతిచెందగా.. మరో లైన్‌మన్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని నేరడిగుంట సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకున్నది. సబ్‌స్టేషన్ పరిధిలోని ఎర్రారం గ్రామంలో తలెత్తిన విద్యుత్ సమస్యను సరిచేస్తున్న క్రమంలో ముందస్తు సమాచారం లేకుండా, ఒక్కసారిగా లైన్ క్లియర్(ఎల్‌సీ) ఇవ్వడంతో.. వైర్లకు విద్యుత్ సరఫరా జరిగింది. దీంతో స్తంభం పైనున్న లైన్‌మన్ చంద్రశేఖర్‌కు విద్యుదాఘాతం తగిలి, కిందపడి మృతిచెందాడు. మరో లైన్‌మన్ మాణిక్యంకు తీవ్రగాయాలయ్యాయి. పోస్టుమార్టం నిమిత్తం చంద్రశేఖర్ మృతదేహాన్ని జోగిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరుణ్ కుమార్‌గౌడ్ తెలిపారు. కాగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, ఘటనా స్థలానికి చేరుకుని, మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. గాయపడిన మాణిక్యంను కూడా పరామర్శించి, ధైర్యం తెలిపారు.

యువకుడి ప్రాణం తీసిన అతివేగం

● బైక్‌పై వెనుక కూర్చున్న వ్యక్తి మృతి



శ్రావణ్‌కుమార్ యాదవ్(ఫైల్)

గజ్వేల్, జూలై 3: అతివేగం ఓ యువకుడి ప్రాణాలు తీసింది. ఈ సంఘటన గజ్వేల్ పట్టణంలో బుధవారం చోటుచేసుకున్నది. ప్రజ్ఞాపూర్‌కు చెందిన గట్టు శ్రావణ్‌కుమార్ యాదవ్(18) గుంటూరు జిల్లాకు చెందిన స్నేహితుడు పూసులూరి త్రినాథ్(18)తో కలిసి ద్విచక్ర వాహనంపై పిడిచెడ్ రోడ్డులో శివాజీ విగ్రహం నుంచి గజ్వేల్ వివేకానంద చౌరస్తా వైపునకు వస్తున్నారు. త్రినాథ్ ద్విచక్ర వాహనాన్ని నడుపుతుండగా.. శ్రావణ్‌కుమార్ వెనక కూర్చున్నాడు. ఆ సమయంలోనే రోడ్డు దాటుతున్న పాదచారి తొగుటకు చెందిన కనకయ్యను త్రినాథ్ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కనకయ్యకు, త్రినాథ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెనక కూర్చున్న శ్రావణ్‌కుమార్ ఎగిరి డివైడర్‌పై పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి గజ్వేల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. శ్రావణ్‌కుమార్ తండ్రి గట్టు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు.

ఒక్క క్లిక్‌తో రూ.14లక్షలు మాయం

● సైబర్ నేరగాళ్ల వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు, జూలై 3: సైబర్ నేరగాళ్ల మాయమాటలకు నమ్మి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఏకంగా రూ.14 లక్షలు పోగొట్టుకున్న సంఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో చోటుచేసుకోగా పోలీసులు బుధవారం వివరాలను వెల్లడించారు. పటాన్‌చెరు ప్రాంతంలో నివసిస్తూ గచ్చిబౌలిలోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తున్న మహిళ ఇటీవల ఆన్‌లైన్ పెట్టుబడులపై ఆసక్తి చూపించారు. సైబర్ మాయగాళ్లు చెప్పినట్లుగా పెట్టుబడులు పెడుతూ వెళ్లారు. ప్రారంభంలో లాభాలు చూపించడంతో మరింత ఆశ పెరిగి భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టారు. ఇలా మొత్తం రూ.14 లక్షలు పెట్టుబడులు పెట్టిన తర్వాత అటువైపు నుంచి సమాధానం కరువైంది. లింక్ పంపిస్తున్నాం క్లిక్ చేయగానే అకౌంట్‌లోకి నగదు క్రెడిట్ అవుతుందని నమ్మబలికారు. నమ్మకంతో లింక్‌ను క్లిక్ చేయడంతో తన అకౌంట్‌లోని మొత్తం రూ.14లక్షలు ఖాళీ అయ్యాయి. నష్టపోయానని గ్రహించిన మహిళ పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సైబర్ క్రైం సెల్ ఆధ్వర్యంలో కేసును దర్యాప్తు చేస్తున్నారు.

రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలి

● డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్

ఝరాసంగం, జూలై 3: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఏడాకులపల్లి గ్రామంలోని సొసైటీలో రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుభరోసా అభిప్రాయసేకరణ పేరుతో వానాకాలం సీజన్‌కు సంబంధించిన నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి, ఏవో వెంకటేశం, ఎంఈవో రేణుక, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ప్రేమ పూర్వకంగా సమస్యను పరిష్కరించుకోవాలి

● నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి కె.అనిత

నర్సాపూర్, జూలై 3: కక్ష సాధింపులకు పోకుండా సామరస్యంగా, ప్రేమ పూర్వకంగా వివాదాలను పరిష్కరించుకోవాలని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి కె.అనిత పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్ కోర్టులో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలోలోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా భార్యాభర్తలు తరచూ గొడవలు పడుతూ కేసులు పెట్టుకుని కోర్టు చుట్టూ తిరుగుతున్నారు. జడ్జి కుటుంబీకుల మధ్య ఉన్న సమస్యను పరిష్కరించారు.

ఎరువుల విక్రయాల్లో అక్రమాలకు తావుండొద్దు

నర్సాపూర్, జూలై 3: ఎరువుల, విత్తనాల విక్రయాల్లో అక్రమాలకు తావు లేకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని మెదక్ జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్‌లోని పలు ఎరువులు, విత్తనాలు విక్రయించే దుకాణాలను స్థానిక మండల అధికారి దీపికతో కలిసి తనిఖీ చేసి మాట్లాడారు. జిల్లాలో ఎక్కడా నకిలీ విత్తనాల విక్రయం జరగకుండా ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. దుకాణ యజమానులు తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలని, ఎరువులు పీవోఎస్ మిషన్ ద్వారానే విక్రయించాలని సూచించారు. డీలర్లు నిబంధనలు ఉల్లంఘించినట్లయితే కఠిన చర్యలుంటాయని గోపాల్ హెచ్చరించారు. ఆయన వెంట ఏఈవో దుర్గప్రసాద్ ఉన్నారు.

నాలుగురోజులుగా త్రీఫేజ్ విద్యుత్‌లో అంతరాయం

పాపన్నపేట, జూలై 3: నాలుగురోజులుగా త్రీఫేజ్ విద్యుత్ రావడం లేదంటూ గిరిజన రైతులు బుధవారం రామతీర్థం సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగురోజులుగా మొదల్లకుంట, నర్సింగరావుపల్లి గిరిజన తండాలకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. తమ పక్కనే ఉన్న మల్లంపేట, రామతీర్థం గ్రామాలకు సరఫరా అవుతుందన్నారు. వరి నాట్లు వేసుకునేందుకు తుకాలు పోకి సిద్ధంగా ఉంచామని పేర్కొన్నారు. కానీ విద్యుత్ సరఫరా లేక 100 ట్రాన్స్‌ఫార్మర్ల కింద వరి నారు ఎండిపోతుందని వాపోయారు. ఏఈకి ఎన్నిసార్లు ఫోన్‌చేసినా స్పందించకపోవడంతో సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశామన్నారు. అధికారులు స్పందించకపోతే, మెదక్-బొడ్మట్పల్లి రోడ్డుపై రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు.

'మాటిచ్చా.. సరస్వతి గుడిని నిర్మించా'

» 'ఆంధ్రజ్యోతి'తో సినీ గేయ రచయిత చంద్రబోస్

» ఆయన స్వగ్రామం చల్లగరిగలో 'ఆస్కార్ గ్రంథాలయం'



ఆస్కార్ గ్రంథాలయం

చిట్యాల, జూలై 3: ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత కనుకుంట్ల చంద్రబోస్ తన గ్రామ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తన స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో సొంత నిధులతో ఆస్కార్ పేరిట ఓ గ్రంథాలయాన్ని నిర్మించారు. ఈ ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం జరగనుంది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో బుధవారం ఫోన్‌లో మాట్లాడిన చంద్రబోస్.. 'గ్రామస్థులకు ఇచ్చిన మాట ప్రకారం సరస్వతి గుడిని నిర్మించా. చాలా సంతోషంగా ఉంది' అని ఆనందం వ్యక్తం చేశారు. చల్లగరిగలోని తమ ఇంటి పక్కన ఉన్న గ్రంథాలయంలో ఎన్నో సాహిత్య పుస్తకాలు చదివానని, వాటి వల్లే తాను ఉన్నత స్థాయికి ఎదిగానని ఈ సందర్భంగా చెప్పారు. ఆర్ఆర్ఆర్ సినిమాకు తాను రాసిన నాటునాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడంతో బాల్య మిత్రులు, గ్రామ ప్రజలు తనని సన్మానించారని చెప్పారు. ఆ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామంలో అత్యాధునిక హంగులతో గ్రంథాలయ భవనం నిర్మిస్తానని ఇచ్చిన మాటను ఈ రోజున నిలబెట్టుకున్నానని వివరించారు. అందరి సహకారంతో రూ. 36లక్షల వ్యయంతో ఎనిమిది నెలల్లో భవనాన్ని సిద్ధం చేసి ఆస్కార్ గ్రంథాలయం అని నామకరణం చేశామని చెప్పారు. కాగా, రచయిత చంద్రబోస్ తన సొంత నిధులతో నిర్మించిన ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని గ్రంథాలయాల జిల్లా కార్యదర్శి శ్రీలత తెలిపారు.

ఇద్దరు రైతుల ఉసురు తీసిన అప్పులు

పెంబి రూరల్, బొంరాస్‌పేట్, జూలై 3: పంటల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డాడు. నిర్మల్ జిల్లా పెంబి మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన రైతు అర్క సంతోష్ (28) తనకున్న ఎకరంతో పాటు నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట వేశాడు. ఇందుకోసం రూ.లక్షల్లో అప్పు చేశాడు. పత్తి విత్తనా లు మొలకెత్తకపోవడంతో పాటు చేసిన అప్పులు తీర్చాలని బాకీలు ఇచ్చిన వారు వేధించడంతో మనస్తాపానికి గురై మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ జిల్లా మెట్లకుంట గ్రామానికి చెందిన బైరం నర్సింహులు(62)కు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వారి వివాహాల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు తనకు ఉన్న రెండు ఎకరాల పొలంలో ఎకరన్న సీలింగ్ భూమిని అమ్మకానికి పెట్టగా కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో బుధవారం ఉరేసుకున్నాడు.

ఉస్మానియా ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయం

» టార్చ్‌లైట్ల వెలుగులో శస్త్రచికిత్సలు

మంగళ్‌హాట్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో బుధవారం మధ్యాహ్నం విద్యుత్ నిలిచిపోవడంతో రోగులు, వైద్యులు ఉక్కిరిబిక్కిరయ్యారు. శస్త్రచికిత్సలు చేసే సమయంలో అంతరాయం కలగడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ నిలిచిన వెంటనే ప్రారంభం కావాల్సిన జనరేటర్లు సైతం మొరాయించాయి. సిబ్బంది వెంటనే విద్యుత్ విభాగం నిపుణులను రప్పించి అరగంట తర్వాత సేవలను పునరుద్ధరించారు. దీంతో అప్పటివరకు సెల్‌ఫోన్, టార్చ్‌లైట్ల వెలుతురులోనే శస్త్రచికిత్సలను కొనసాగించినట్లు సమాచారం.

'జికా'...వస్తోంది జాగ్రత్త

రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం.. మహారాష్ట్రలో పెరుగుతున్న కేసులతో ఆందోళన

» సంసిద్ధంగాలేని తెలంగాణ వైద్యశాఖ

» కనీస చర్యలూ తీసుకోని వైనం

» ఇప్పటికే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల విజృంభణ



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో జికా వైరస్ విజృంభిస్తోంది. రెండు రోజుల క్రితం పుణెలో ఒక్క రోజే ఆరు జికా వైరస్ వ్యాధి (జడ్‌వీడీ) కేసులు నమోదుకావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం బుధవారం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈమేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్‌ఎస్) డాక్టర్ అతుల్‌గోయల్ అడ్వైజరీ జారీ చేశారు. జికాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా గర్భిణులను స్ర్కీనింగ్ చేయాలని కేంద్రం కోరింది. జికా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన గర్భిణుల్లో పిండం ఎదుగుదలను పర్యవేక్షించాలని సూచించింది. ప్రతి ఆస్పత్రిలో కచ్చితంగా ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని, ఆ అధికారి జికా వైరస్ వ్యాప్తికి కారణమయ్యే దోమల పెరుగుదల నివారణకు చర్యలు చేపట్టాలని కోరింది. జికా కేసులు నమోదైతే వెంటనే నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీవీబీడీసీ)కు రిపోర్టు చేయాలని, అనుమానిత నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపాలని సూచించింది. అలాగే ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని వైరస్ పరిశోధనా కేంద్రాలకు కూడా శాంపిళ్లను పంపాలని ఆదేశించింది.

నివారణ ఎలాగంటే..

దోమల వృద్ధిని నివారించడానికి ఇళ్లు, బహిరంగ ప్రదేశాల చుట్టూ నిలిచిన నీటిని తొలగించాలి. జికా కూడా లైంగికంగా సంక్రమించే అవకాశం ఉన్నందున సురక్షితమైన విధానాలను పాటించాలి. జికాకు నిర్దిష్ట చికిత్స లేదు, కానీ లక్షణాల ఆధారంగా చికిత్సను అందిస్తారు. జికా లక్షణాలు కనిపిస్తే వెంటనే సరైన రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని డాక్టర్‌ను సంప్రదించాలి.

అప్రమత్తంగాలేని రాష్ట్ర వైద్యశాఖ..

మహారాష్ట్ర నుంచి తెలంగాణకు రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి మహమ్మారులు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే బాధ్యత క్షేత్రస్థాయిలో ప్రజారోగ్య సంచాలకులకే ఉంటుంది. అయితే మన వద్ద ఇంతవరకు అందుకు సంబంధించిన కార్యాచరణేమీ కానరావడంలేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఒక వైపు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల విజృంభణ మొదలైంది. గత ఐదు నెలల్లో మలేరియా, డెంగ్యూ మరణాలు కూడా సంభవించాయి. పటిష్ఠ పర్యవేక్షణ లేకపోవడం తో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన ఉన్న విభాగాధిపతి లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. అందుకే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దోమల ద్వారా వ్యాప్తి..

జికా వైరస్ అనేది దోమల ద్వారా సంక్రమించే ఫ్లేవి వైరస్. జికా ప్రధానంగా ఏడెస్ దోమల కాటు ద్వారా వ్యాపిస్తుంది. ఇదే దోమ కుడితే డెంగ్యూ, చికున్‌గున్యా, ఎల్లో ఫీవర్ వైరస్‌లు కూడా సోకుతాయి. జికా సోకితే సాధారణ లక్షణాలే ఉంటాయి. ఇవి 2-7 రోజులపాటు కనిపిస్తాయి. ముఖ్యంగా జ్వరం, దద్దుర్లు, కీళ్ల నొప్పి, కండ్లకలక (ఎరుపు కళ్లు), కండరాలు, తలనొప్పితో పాటు మరికొన్ని తీవ్రమైన సమస్యలు కలుగుతాయి. మైక్రోసెఫాలీ (పుట్టుక లోపం), గులియన్ బారే సిండ్రోమ్ (న్యూరోలాజికల్ డిజార్డర్), మెనింజైటిస్ (మెదడు, వెన్నెముక లైనింగ్ వాపు)లాంటి వాటికి కారణమౌతుంది.

కుటుంబాన్ని మింగేసిన మద్యం రాకాసి

» మద్యానికి బానిసైన భర్త వేధింపులు తాళలేక..

» ముగ్గురు కుమార్తెలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

» చికిత్స పొందుతూ తల్లీ, ఓ కూతురు మృతి

» మిగిలిన ఇద్దరి పరిస్థితి విషమం

» కుమరం భీం జిల్లాలో ఘటన



అనిత, రమ్య(ఫైల్)

కాగజ్‌నగర్, జూలై 3: ఐదుగురు ఆడపిల్లల తండ్రి అయిన ఓ వ్యక్తి బాధ్యతలు మరచి మద్యానికి బానిసై వేధింపులకు గురి చేస్తుండడంతో జీవితంపై విరక్తి చెంది అతని భార్యాబిడ్డలు ఆత్మహత్యకు యత్నించారు. భార్య, ఓ కుమార్తె మరణించగా మరో ఇద్దరు కూతుళ్ల పరిస్థితి విషమంగా ఉంది. ఇలా కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడ గ్రామానికి చెందిన ఓ కుటుంబాన్ని మద్యం మింగేసింది. వివరాలిలా ఉన్నాయి. గజ్జిగూడకు చెందిన ప్రతాప్‌కు భార్య అనిత(55), ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కూతురికి వివాహమవ్వగా లక్ష్మి(21), రవళి(18), రమ్య(16), ఐశ్వర్య(14) ఇంటి వద్దే ఉంటున్నారు. మద్యానికి బానిసైన ప్రతాప్ తాగిన మైకంలో గ్రామస్థులతో నిత్యం గొడవలు పడుతుండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో తమకున్న వ్యవసాయ భూమిలో కొంత భాగాన్ని అమ్మేశాడు. మిగిలిన కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ అనిత కుటుంబాన్ని పోషించేది. ఈ క్రమంలో 15 రోజుల క్రితం పొలం వద్ద జరిగిన గొడవలో భాగంగా ప్రతాప్ ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేశాడు. దీంతో హత్యాయత్నం కేసులో ప్రతాప్ జైలుకెళ్లాడు. అయితే, గ్రామ ప్రజల సాయంతో ప్రతాప్‌కు బెయిల్ ఇప్పించిన అనిత భర్తను జైలు నుంచి బయటకు తీసుకొచ్చింది. ఆ తర్వాత కూడా ప్రతాప్ తీరుమారకపోవడంతో మద్యం మానేయాలంటూ అనిత సోమవారం గొడవపడింది. ఇందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రతాప్ భార్య అనితపై దాడి చేసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అనిత.. కుమార్తెలు రమ్య, లక్ష్మీ, ఐశ్వర్య, రవళితో కలిసి పొలానికి వెళ్లి ఆత్మహత్య చేసుకుందామని చెప్పింది. రవళి మినహా తల్లీ కూతుళ్లు అందరూ పురుగు మందు తాగేశారు. రవళి కేకలు విని అక్కడికి వచ్చిన చుట్టుపక్కల పొలాల్లోని వారు అనిత, ఆమె కుమార్తెలను ఆస్పత్రికి తరలించారు. అయితే, రెండ్రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిత, రమ్య బుధవారం మృతి చెందారు. లక్ష్మి, ఐశ్వర్య పరిస్థితి విషమంగా ఉంది. మరోపక్క, ప్రతాప్‌ను పోలీసులు అరెస్టు చేశారు.



సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో గుర్తించిన సిడితల వీరగల్లు

తల నరుక్కొంటే.. శివ సన్నిధికి చేరుకుంటామని..

» చాళుక్యులు, రాష్ట్రకూటుల కాలంలో శైవుల్లో ఈ విశ్వాసం

» 'సిరితల వీరగల్లు'గా ప్రశస్తి.. సిద్దిపేట జిల్లా రాయల్‌పోల్‌లో విగ్రహం లభ్యం

రాయపోల్, జూలై 3: ప్రాణార్పన చేస్తే దేవుడి సన్నిధికి చేరుకుంటామని నమ్మడం.. ఓ పదునైన ఆయుధంతో తమ తలను తామే నరుక్కోవడమో.. మరొకరితో నరికించుకోవడమో చేయడం గురించి విన్నారా? 6వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు నడిచిన చాళుక్యుల కాలంలో, అప్పట్లోనే రాష్ట్రకూటుల హయాంలో శైవభక్తుల్లో ఈ విశ్వాసం ఉండేదట! భాసింపట్టు వేసుకున్న స్థితిలో తలపైన ఉన్న జుట్టు సాయంతో తాటిచెట్టుకో.. వెదురు చెట్టుకో వేలాడుతున్న వ్యక్తితో ఉన్న ఆ శిల్పాన్ని చూస్తున్నారా? ఆ వ్యక్తి చేతులు ముకుళితమై ఉన్నాయి. తల నుంచి మొండెం వేరయినట్లుగా మధ్యలో గ్యాప్‌ను స్పష్టంగా గమనించొచ్చు! ఈ శిల్పాన్ని 'సిడితల వీరగల్లు' అంటారు. శైవభక్తులు ఆత్మబలిదానాలను ధర్మకార్యంగా భావించేవారు. శివసన్నిధికి చేర్చే తక్షణ మార్గంగా ఆత్మబలిదానాలను ఎంచుకునేవారు. పైగా తల నరుక్కొని మరణిస్తే, తమ ప్రాణాలను తీసుకెళ్లేందుకు దేవాంగనలు వస్తారని విశ్వసించేవారు. ఈ శిల్పంలో.. పైన ఇద్దరు మహిళలుండటాన్ని గమనించవచ్చు! ఫొటోలో కనిపిస్తున్న ఈ 'సిడితల వీరగల్లు' సిద్దిపేట జిల్లా రాయపోల్‌లోని పురాతన గణపతి ఆలయం ప్రాంగణంలోనిది. దీన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ గుర్తించి.. వివరించారు. మహిళా సిడితల వీరగుల్లులు జనగామ జిల్లా లింగపల్లిలో లభించాయి. పురుష సిడితల వీరగల్లులు ఇప్పటి దాకా యాదాద్రి జిల్లా చొల్లేరులో, వనపర్తి జిల్లా కేంద్రంలో లభించగా రాయపోల్‌లోనిది మూడోది. ఇక సిడితల వీరగల్లులు కాకుండా కేవలం వీరగల్లులూ ఉంటాయి. తోటి ప్రజలను, పాడిపశువులను కాపాడే క్రమంలో అడవి జంతువులతో పోరాడి చనిపోతే, యుద్ధాల్లో పాల్గొని ప్రాణాలు కోల్పోతే వారిని వీరగల్లుగా చెక్కి ప్రజలు ఆరాధించేవారు.

పెంటారెడ్డి పదవీకాలం ఆర్నెల్లు పొడిగింపు


నీటిపారుదలశాఖలో ఎత్తిపోతల పథకాల సలహాదారుడు కె.పెంటారెడ్డి పదవీ కాలాన్ని మరో ఆర్నెల్ల పాటు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెంటారెడ్డి పదవీకాలం పొడిగింపు నిర్ణయం మే 16 నుంచి ఆరునెలల పాటు అమలులో ఉండనుంది.

బాసర త్రిపుల్ ఐటీకి పలువురు విద్యార్థుల ఎంపిక

● అభినందించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

సిద్దిపేట రూరల్/నారాయణరావుపేట/వర్గల్/దుబ్బాక/సిద్దిపేట క్రైం/నంగునూరు/రాయపోల్/తొగుట/గజ్వేల్/దౌల్తాబాద్/మద్దూరు/ కుకునూరుపల్లి/చిన్నకోడూరు/జిన్నారం/పుల్‌కల్/కొల్చారం/చేగుంట, జూలై 3: బాసర త్రిపుల్ ఐటీకి నారాయణరావుపేట మండలంలోని ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాలల నుంచి 11 మంది విద్యార్థులు ఎంపికైనట్లు మండల విద్యాధికారి యాదవరెడ్డి బుధవారం తెలిపారు. మండలంలో జక్కాపూర్ పాఠశాల నుంచి ఐదుగురు, నారాయణరావుపేట పాఠశాల నుంచి నలుగురు, లక్ష్మీదేవిపల్లి నుంచి ఒక్కరు, గుర్రాలగొంది నుంచి ఒక్క విద్యార్థి ఎంపికైనట్లు పేర్కొన్నారు. సిద్దిపేట రూరల్ మండలం ఆదర్శ పాఠశాల నుంచి 9 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సామలేటి బుచ్చిబాబు తెలిపారు. వర్గల్ మండలం మైలారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన కుమ్మరి నిత్యశ్రీ, దుబ్బాక మున్సిపాలిటీలోని లచ్చపేట మోడల్ స్కూల్ చెందిన 10 మంది విద్యార్థులు బాసర త్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. సిద్దిపేటలోని ఇందిరానగర్ పాఠశాల నుంచి 15 మంది విద్యార్థులు బాసర త్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు రాజా ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నంగునూరు మండలంలోని నంగునూరు నుంచి 19 మంది, నర్మెట్ట 15, అంక్షాపూర్ ఆరుగురు, గట్లమల్యాలలో ఐదుగురు, మగ్దుంపూర్ 2, పాలమాకుల 2, రాజగోపాల్ పేట 2, బద్దిపడగ ఒక్కరు, టీఎస్ అక్కెనపల్లి మోడల్ స్కూల్ నుంచి 8 మంది, మొత్తం 60 మంది విద్యార్థులు బాసర త్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. రాయపోల్ మండలం బేగంపేట పాఠశాలకు చెందిన ఒగ్గు పవన్‌కుమార్, ఏర్పుల దీక్షిత, తొగుట మండలంలోని కానుగల్, ఘనపూర్, వెంకటాంరావుపేట, తొగుట, ఎల్లారెడ్డిపేట పాఠశాలల నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. గజ్వేల్ మండలం రిమ్మనగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సిద్ధాల పూజ, అహ్మదీపూర్‌కు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బొల్లు హాసిని బాసర త్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు సుగుణాకర్ తెలిపారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన వంశీ, సంయుక్త, కర్ణ బాసర త్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. మద్దూరులోని మోడల్‌స్కూల్‌కు చెందిన బొప్పె ప్రణీత, అర్జుల ప్రసన్న, చెన్న చందన, ఇరుమల్ల అఖిల, దండ్ల రిషిత, కొండ విలాస్, చిలువేరు సుమంత్, బండేలా లోకేశ్‌రెడ్డి, మింద అక్షయ, కుకునూరుపల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన భానుప్రసాద్, కార్తీక్, శృతి, పుష్పాంజలి, దీప్తి, బాలరాణి, స్రవంతి, కావ్యశ్రీ, వినయ్, సాయికుమార్, అజయ్, కార్తీక్, చిన్నకోడూరు మండలంలోని అల్లీపూర్ 5, అనంతసాగర్ 2, చంద్లాపూర్ 3, చిన్నకోడూరు 21, చౌడారం 3, గోనెపల్లి 4, మాచాపూర్ 4, మేడిపల్లి 2, పెద్దకోడూరు 1, రామునిపట్ల 1, ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్‌కు చెందిన 16 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. బాసర త్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన సిద్దిపేట నియోజకవర్గంలోని విద్యార్థులను ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందించారు. జిన్నారం మండలం బొల్లారం మోడల్ పాఠశాలకు చెందిన ఇద్దరు, చౌటకూర్ మండలం శివంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కుమ్మరి హిందు, కొల్చారం మండలం రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇ.నందిని, బి.భూపాల్, చేగుంటలోని ఆదర్శ పాఠశాలకు చెందిన పావని, అక్షిత, ముస్కన్ బాసర త్రిబుల్ ఐటీకి ఎంపికయ్యారు.

టేక్మాల్ పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం



డీసీవోకు అవిశ్వాస తీర్మానం అందజేస్తున్న డైరెక్టర్లు

టేక్మాల్, జూలై 3: మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ యశ్వంత్‌రెడ్డి, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెడుతూ బుధవారం 8 మంది డైరెక్టర్లు మెదక్ డీసీవోను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ టేక్మాల్ సహకార సంఘంలో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా.. ఒక్కరు మరణించారు. పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి 12 మంది డైరెక్టర్లకు ఏ విషయం చెప్పకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ పాలకవర్గాన్ని నిర్వీర్యం చేస్తూ నిధులు దుర్వినియోగం చేశాడని ఆరోపించారు. ఈ కారణంతోనే ప్రాథమిక సహకార చట్టం 1964 ప్రకారం చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన పత్రాన్ని అందజేశామన్నారు. ఇందులో డైరెక్టర్లు నర్సింహారెడ్డి, పులి సత్యనారాయణ, పాపయ్య, నరేందర్, శ్రీరాములు, చందర్, లక్ష్మి, మంగమ్మలు ఉన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల ధర్నా



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

హత్నూర, జూలై 3: సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం నాగులదేవులపల్లి గ్రామంలో మండల పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట విద్యార్థులు, గ్రామస్థులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఆ పాఠశాలలో వంద మంది విద్యార్థులు ఉన్నప్పటికీ కేవలం ఇద్దరు టీచర్లు మాత్రమే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని ఉపాధ్యాయులతో విద్యార్థులకు బోధన ఎలా సాధ్యమౌతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ బడులు అధికారులకు పట్టవా.. అంటూ మండిపడ్డారు. పాఠశాలకు సరిపడా ఉపాధ్యాయులను నియమించే వరకు తమ ఆందోళన కార్యక్రమాలు దశలవారీగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ సుధాకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌కు పుణే రోడ్డు ప్రమాద మృతదేహాలు

● అశ్రునయనాలతో ముగిసిన అంత్యక్రియలు

● నివాళులర్పించిన నాయకులు, ప్రజాప్రతినిధులు

● కారు టైరు పేలడంతోనే ప్రమాదం



నారాయణఖేడ్‌కు మృతదేహాలు చేరుకోవడంతో కన్నీరుమున్నీరవుతున్న కుటుంబసభ్యులు



మృతుల కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జూలై 3: మహారాష్ట్రలోని పుణే సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వారి మృతదేహాలు బుధవారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చేరుకోగా బంధువులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరు అయ్యారు. నారాయణఖేడ్ పట్టణానికి చెందిన ఆరుగురు యువకులు అజ్మీర్ దర్గాను దర్శించుకోవడానికి కారులో వెళ్లి మంగళవారం తిరిగి వస్తుండగా, పుణే, షోలాపూర్‌ల మధ్య ప్రధాన రహదారిపై టైరు పేలి కల్వర్టును ఢీకొనడంతో ఐదుగురు యువకులు అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. ఖేడ్ ప్రాంతానికి చెందిన నలుగురితోపాటు ఇదే ప్రాంతానికి చెందిన హైదరాబాద్‌లో స్థిరపడిన ఇద్దరు మొత్తం ఆరుగురు అజ్మీర్ దర్గాను దర్శించుకోవడానికి ఆదివారం కారులో వెళ్లారు. ప్రమాదంలో ఐదుగురు మృతి చెందిన విషయం తెలుసుకున్న మృతుల కుటుంబీకులు, బంధువులు, మంగళవారం రాత్రే ప్రమాద స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలకు పుణే జిల్లా ఇందాపూర్ ప్రభుత్వ వైద్యశాలలో శవ పరీక్ష చేయించిన అనంతరం వారి కుటుంబీకులకు అక్కడి పోలీసులు అప్పగించారు. ఖేడ్ పట్టణానికి చెందిన రఫీక్ ఖురేషి(26), మహబూబ్ ఖురేషి(28)ల మృతదేహాలను అంబులెన్స్‌లో నారాయణఖేడ్‌కు తీసుకువచ్చారు. ఈ మృతదేహాలు ఖేడ్‌కు చేరుకోగానే, కుటుంబీకులు, బంధువులు, స్నేహితులు రోధించిన తీరు పలువురిని కంట తడి పెట్టించింది. వీరి అంత్యక్రియలు మధ్యాహ్నం ఖేడ్‌లో నిర్వహించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఫిరోజ్ ఖురేషి(27), మజీద్ పటేల్(26) మృతదేహాలను నేరుగా నగరానికి, మృతిచెందిన వారిలో మరొకరైన ఫిరోజ్ ఖురేషి మృతదేహాన్ని స్వస్థలమైన నారాయణఖేడ్ డివిజన్‌లోని కంగ్టికి తరలించారు. మృతిచెందిన వారి అంత్యక్రియలు బుధవారం పూర్తి అయినట్లు వారి కుటుంబీకులు తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్‌కు చెందిన సయ్యద్ అమర్(25) పూణె వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. కాగా ప్రమాదంలో మృతిచెందిన వారి మృతదేహాలు ఖేడ్‌కు చేరుకోగానే స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి, టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ నాయకులు సాగర్‌షెట్కార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాహేర్ అలీ, మాజీ ఎంపీటీసీ ముంతాజ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కంగ్టి పీఏసీఎస్ మాజీ చైర్మన్ మనోజ్‌పాటిల్, ముఖ్య నాయకులు నాగన్న, శ్రీనివాస్‌రెడ్డి, షైనోద్దీన్, రాజు, తదితరులు నివాళులర్పించి, మృతుల కుటుంబసభ్యులను ఓదార్చారు. ఖేడ్ ప్రాంతానికి చెందిన ఐదుగురు ఒకేసారి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

రైల్వేస్టేషన్ల ఆధునీకరణతో ప్రయాణికులకు ప్రయోజనం

● దక్షిణ మధ్య రైల్వే(డీఆర్ఎం) రీజినల్ మేనేజర్ బర్తీష్‌కుమార్ జైన్

● రైల్వేస్టేషన్లలో కొనసాగుతున్న పనులపై సంతృప్తి



రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకుంటున్న దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం బర్తీష్‌కుమార్ జైన్

జహీరాబాద్, జూలై 3: అమృత్‌భారత్ పథకంలో భాగంగా రైల్వేస్టేష్ల ఆధునీకరణతో ప్రయాణికులకు మరింత ప్రయోజనం చేకూరనున్నదని దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం బర్తీష్‌కుమార్ జైన్ అన్నారు. బుధవారం ఆయన కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణలోని పర్లీ, బీదర్, జహీరాబాద్, వికారాబాద్, ఖానాపూర్ తదితర రైల్వేస్టేషన్లను పరిశీలించారు. అనంతరం జహీరాబాద్‌లో కొనసాగుతున్న రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలోని జహీరాబాద్, వికారాబాద్, తాండూర్ రైల్వేస్టేషన్లలో అమృత్‌భారత్ పథకంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. ఆయా రైల్వేస్టేషన్లలో కొనసాగుతున్న పనుల తీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. పనులను వేగవంతం చేయాలని రైల్వే అధికారులను ఆదేశించారు. తాండూర్-జహీరాబాద్ మధ్య నూతన రైల్వే లైన్ల సర్వే పనులు జరుగుతున్నందున, అవి పూర్తయ్యాక మంజూరీ విషయాన్ని రైల్వేశాఖ అధికారులు ఆలోచిస్తారని తెలిపారు. జహీరాబాద్-బీదర్, ముంబయి, తదితర ప్రాంతాలకు ప్రయాణికుల రద్దీ, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్త రైళ్లను నడిపేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాంలను ఆధునిక తరహాలో ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంలు సుబ్రహ్మణ్యం, గోపాల్, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలాఉండగా హైదరాబాద్-బీదర్ ఇంటర్ సిటీ రైళ్ల సంఖ్యను పెంచాలని, పూర్ణ-తిరుపతి రైలును జహీరాబాద్ స్టేషన్‌లో కాసేపు నిలిచేలా చర్యలు చేపట్టాలని, జహీరాబాద్ నుంచి ముంబయి వరకు రైలు సౌకర్యం కల్పించేలా చూడాలని కోరుతు బీజేపీ జిల్లా నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, బక్కయ్యగుప్తా డీఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు.

సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు క్షమాభిక్ష

● సంగారెడ్డి సెంట్రల్ జైలు నుంచి ఒకరు విడుదల

కంది, జూలై 3: క్షణికావేశంలో చేసిన తప్పులకు కుంగిపోతూ జైళ్లలో మగ్గిపోతున్న ఖైదీలకు ప్రభుత్వం క్షమాభిక్ష పెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 213 మందిని బుధవారం తెలంగాణ ప్రభుత్వం క్షమాభిక్ష పెట్టి ముందస్తుగా విడుదల చేసింది. సంగారెడ్డి సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఝరాసంఘం మండలానికి చెందిన ఒక జీవిత ఖైదీ విడుదలయ్యాడు. ఈ సందర్భంగా సంగారెడ్డి జెంట్రల్ జైలు సూపరింటెండెంట్ దండా భరత్‌రెడ్డి మాట్లాడుతూ 2011లో జరిగిన ఒక హత్య కేసులో అతడికి జీవిత ఖైదు శిక్ష పడిందన్నారు. అప్పటినుంచి శిక్ష అనుభవిస్తూ సత్ప్రవర్తనతో మెలిగాడని తెలిపారు. అతని సత్ప్రవర్తన కారణంగా ప్రభుత్వం బుధవారం విడుదల చేసిందని పేర్కొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

● సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో విద్యార్థుల ఆందోళన



వసతి గృహం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

పుల్‌కల్, జూలై 3: చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ వద్ద గల జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో నాణ్యమైన భోజనం అందజేయాలని కోరుతూ విద్యార్థినులు బుధవారం ఆందోళన చేశారు. కళాశాల ఆవరణలోని వసతి గృహంలో ఉంటున్న బాలికలకు కొన్ని రోజులుగా మెస్ కాంట్రాక్టర్ నాణ్యమైన భోజనం సరఫరా చేయడం లేదంటూ గగ్గోలు పెట్టారు. ఇందులో భాగంగానే బుధవారం ఉదయం బాలికలు మూకుమ్మడిగా తరగతులను బహిష్కరించి వసతి గృహం ప్రధాన ద్వారా ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. జేఎన్టీయూలోని మెస్ కాంట్రాక్టర్ నాణ్యమైన బోజనం అందించడం లేదని, వెంటనే మెస్ కాంట్రాక్టర్‌ను మార్చాలంటూ డిమాండ్ చేశారు. మెస్‌లో భోజనం బాగాలేకపోవడంతో బయట హోటళ్లు, ఇతరత్రా రెస్టారెంట్ల నుంచి పార్సిల్స్ తీసుకొచ్చి భోజనం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై విద్యార్థినులు కళాశాల ప్రిన్సిపాల్ జి.నరసింహకు ఫిర్యాదు చేయగా, మెస్ కాంట్రాక్టర్‌ను మారుస్తామని తెలిపారు. ఈ విషయాన్ని జేఎన్టీయూహెచ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకుంటానని హామీఇచ్చారు.

ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకూడదు

● గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య

గజ్వేల్, జూలై 3: ఇంటి పరిసరాల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య సూచించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లోని మురికికాలువల్లో బుధవారం దోమల మందును పిచికారి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వారితో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులున్నారు.

చెత్త విభజనపై అవగాహన

హుస్నాబాద్ టౌన్, జూలై 3: హుస్నాబాద్ పట్టణంలోని సిద్దార్థ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం చెత్త విభజనపై మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అవగాహన కల్పించారు. తడిచెత్త, పొడిచెత్త, హానికరమైన చెత్తను వేరు చేసి ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లకు బదులు వస్త్ర సంచులను వినియోగించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వార్డు కౌన్సిలర్ కోమటి స్వర్ణలత, హెచ్ఎం రాధా సురేందర్‌రెడ్డి, రవికుమార్ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులున్నారు.

సాయుధ పోరాటంలో గొప్ప చరిత్ర

● ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మద్దూరు, జూలై 3: తెలంగాణ సాయుధ పోరాటంలో మద్దూరు ప్రాంతానికి గొప్ప చరిత్ర ఉందని, గ్రామాభివృద్ధే లక్ష్యంగా ఎంపీటీసీలు ఐదేళ్ల కలిసిమెలసి ఉండటం సంతోషకరమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. మద్దూరు ప్రాంతంలోని వీరబైరాన్‌పల్లి, కూటిగల్, బెక్కల్, సలాఖ్‌పూర్ గ్రామాలు చైతన్యం వెల్లివిరిసిన గ్రామాలుగా ఉన్నాయన్నారు. ఆనాడు ప్రజలందరూ బాగుండాలని, బానిసత్వం పోవాలని పోరాటంలో పాల్గొన్న ఘనచరిత్ర ఉందన్నారు. తాను చుక్కా రామయ్యతో కలిసి మొదటిసారిగా మద్దూరుకు వచ్చానన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం తర్వాత నక్సలైట్ ఉద్యమం ఉధృతంగా సాగిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



ఎంపీటీసీలకు సన్మానిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

సన్మానం..

పదవీ కాలం పూర్తి చేసుకున్న ఎంపీటీసీలతో పాటు జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డికి జ్ఞాపికలు అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సేవే గౌరవాన్ని తెచ్చిపెడుతుందన్నారు. ప్రపంచంలో ఎక్కడైనా ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది రాజకీయపార్టీలేనన్నారు. రాజకీయపార్టీల్లో భాగస్వామ్యం అయినందుకు గర్వపడాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గిరికొండల్‌రెడ్డి, ఎంపీడీవో రామ్మోహన్, ప్రత్యేకాధికారి రాధిక, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ముదస్సీర్, వివిధ శాఖల అధికారులు, సెక్రటరీలు కూరెల్ల రాజు, నందనబోయిన నర్సింహులు, గుజ్జుక సమ్మయ్య, ఇర్రి రాజేశ్వర్‌రెడ్డి, చెట్కూరి కల్యాణికమలాకర్, ఇస్లావత్ నముకు, బొప్పెకనకమ్మ, గూళ్ల సత్యకళ, కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ జిలానితో పాటు వివిధ శాఖల అధికారులు, సెక్రటరీలు పాల్గొన్నారు.

ప్రజాసేవకు విరమణ ఉండదు

● జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి



జడ్పీవైస్ చైర్మన్ రాజారెడ్డిని సత్కరిస్తున్న ఎంపీపీ, ఎంపీటీసీలు

హుస్నాబాద్‌రూరల్, జూలై 3: ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే నాయకులకు విరమణ ఉండదని జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి పేర్కొన్నారు. బుధవారం హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో జడ్పీటీసీ ఎంపీపీ, ఎంపీటీసీలకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీవైస్ చైర్మన్ మాట్లాడారు. ప్రజాప్రతినిధులుగా ఐదు సంవత్సరాలు అభివృద్ధి కార్యాక్రమాలు చేపట్టిన ఎంపీటీసీలు, ఎంపీపీ, అధికారులను అభినందించారు. ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపీపీ లకావత్ మానస వివరించారు. ఈ సందర్భంగా జడ్పీ వైస్‌చైర్మన్ రాజారెడ్డి, ఎంపీపీ మానస, ఎంపీటీసలను మండల పరిషత్ ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీవో సత్యనారాయణ, వైస్ ఎంపీపీ దేవసాని నిర్మల, ఎంపీటీసీలు బొమ్మగాని శ్రీనివాస్, పిట్టల శావణి, జయలక్ష్మి, అన్నపూర్ణ ఉన్నారు.

సేవ చేయడానికే రాజకీయాల్లోకి రావాలి

● ఎంపీపీ బాలేశంగౌడ్



ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎంపీడీవో

జగదేవ్‌పూర్, జూలై 3: ప్రజలకు సేవ చేయాలనే దృక్పథంతో రాజకీయాల్లోకి రావాలని ఎంపీపీ బాలేశంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. బుధవారం జగదేవ్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యుల వీడ్కోలు సమావేశాన్ని ఎంపీడీవో యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీటీసీలను ఎంపీడీవో యాదగిరి మెమొంటో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందరభంగా వారు మాట్లాడుతూ.. ఐదేళ్ల పదవీ కాలంలో ప్రజలకు సేవ చేసే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. స్వార్థంతో రాజకీయాల్లోకి రావొద్దని, నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భగవంతం, ఎంపీటీసీ సభ్యులు కిరణ్‌గౌడ్, కవిత, కావ్య, దుర్గయ్య, మహేందర్‌రెడ్డి, మహేష్ యాదవ్, స్రవంతి, శివకుమార్, జుబేదబేగం, రమ్య, రవి ఉన్నారు.

నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

● గజ్వేల్ ఏసీపీ కె.పురుషోత్తంరెడ్డి



మాట్లాడుతున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్, జూలై 3: నూతన చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని గజ్వేల్ ఏసీపీ కె.పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ మండలం బూర్గుపల్లిలో బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నూతన చట్టాలు, మహిళా రక్షణ చట్టాలు, ఈవ్‌టీజింగ్, పోక్సో, షీటీమ్స్, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా అమల్లోకి వచ్చిన చట్టాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలను వేధిస్తే 100, 112, 1098, షీటీమ్స్ వ్యాట్సాప్ నెంబర్ 8712667343, మహిళా పోలీస్‌స్టేషన్ నెంబర్ 8712667435 ఫోన్ చేయాలన్నారు. వారితో గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ట్రాఫిక్ సిబ్బంది, భరోసా సెంటర్ సిబ్బంది, షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, మహిళా కానిస్టేబుల్ శ్యామల, కానిస్టేబుల్ రామచంద్రారెడ్డి తదితరులున్నారు. గజ్వేల్ పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో సైబర్ జాగృకత దివాస్ సందర్భంగా విద్యార్థినులకు సైబర్ నేరాలపై, ఆర్థిక నేరాలపై, ఆర్థికేతర నేరాలపై గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా అవగాహన కల్పించారు. వారితో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ గోపీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రుక్మిణి, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కుకునూరుపల్లిలో ముగిసిన మిషన్ భగీరథ సర్వే

● మండలంలో 4వేల కనెక్షన్స్

కుకునూరుపల్లి, జూలై 3: ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు మిషన్ భగీరథ సర్వేను గత నెల 7వ తేదీ నుంచి 28 వరకు చేపట్టారు. ఇందులో భాగంగా అధికారులు గ్రామాల్లోని ప్రతీ ఇంటికి వెళ్లి ఇంటి యజమాని ఫొటో, ఆధార్‌కార్డ్ నెంబర్, ఫోన్ నెంబర్‌లను సేకరించి యాప్‌లో నమోదు చేశారు. గ్రామంలో మొత్తం ఎన్ని మిషన్ భగీరథ కనెక్షన్‌లు ఉన్నాయి. కొత్తగా ఎవరికి కావాలో వారి వివరాలను అధికారులు నమోదు చేసుకున్నారు.

అత్యధికంగా..

మండలంలో 14 గ్రామాలు ఉండగా అధికారులు చేపట్టిన సర్వేలో భాగంగా 4045 మిషన్ భగీరథ నల్లా కనెక్షన్స్ ఉన్నాయని ధ్రువీకరించారు. అత్యధికంగా కుకునూరుపల్లి గ్రామంలో 935, అత్యల్పంగా రామచంద్రాపూర్‌లో 82 మిషన్ భగీరథ కనెక్షన్‌లు ఉన్నాయి. నూతన కనెక్షన్‌ల కోసం పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని తెలిపారు.



తిప్పరంలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

ప్రభుత్వ ఆదేశానుసారం..

ప్రభుత్వ ఆదేశానుసారం మిషన్ భగీరథ సర్వే చేపట్టం. ఇందులో భాగంగా ప్రతీ ఇంటికి మిషన్‌భగీరథ కనెక్షన్ ఉన్నదా లేదా అని తెలుసుకున్నాం. ఈ వివరాలను అధికారులు యాప్‌లో నమోదు చేశారు.

ఎంపీడీవో వెంకటేశ్వర్లు

రాహుల్‌గాంధీ హిందువులకు క్షమాపణ చెప్పాలి

● బీజేపీ రాష్ట్ర నాయకుడు మాదాడి జశ్వంత్‌రెడ్డి



పట్టణంలో ఇందిరాపార్కు చౌరస్తాలో మాట్లాడుతున్న నాయకులు

గజ్వేల్, జూలై 3: రాహుల్‌గాంధీ వెంటనే హిందువులకు క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు మాదాడి జశ్వంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తాలో పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ హిందువులపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆయన చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. దేవుళ్లపై రాహుల్‌గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని, హిందువులకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. వారి వెంట బీజేపీ నాయకులు మహేశ్, నాగులు, మన్నె శేఖర్, మండలాధ్యక్షుడు అశోక్‌గౌడ్, నాయకులు, మహిళా నాయకులు ఉన్నారు.

రైతాంగంపై కేంద్రానికి చిత్తశుద్ధి లేదు

● రైతుసంఘం సిద్దిపేట జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి

చేర్యాల, జూలై 3: రైతాంగంపై కేంద్రానికి చిత్తశుద్ధి లేదని, నామమాత్రపు మద్దతు ధరలను ప్రకటించడం శోచనీయమని రైతుసంఘం సిద్దిపేట జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు రైతులకు మద్దతు ధర అందించాలని డిమాండ్‌చేస్తూ బుధవారం కొమురవెల్లి తహసీల్దారు లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు 20శాతం పెరిగినప్పటికీ, కేంద్రప్రభుత్వం ఖర్చులు తగ్గించి చూపించడం తగదన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ తరహాలలో తెలంగాణలో కూడా ధరల నిర్ణాయక కమిషన్ సీఏసీపీ వేసి, అన్నిపంటలకు మద్దతుధర నిర్ణయించి అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బద్దిపడిగ కృష్ణారెడ్డి, నీల బిక్షపతి, వుల్లంపల్లి సాయిలు, దయానంద్, దాసరి చక్రపాణి, గాంధారి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఐసీడీఎస్ ప్రీ స్కూల్ శిక్షణా తరగతులు



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి డీడబ్ల్యూవో శారద

చేర్యాల, జూలై 3 : జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న నూతన పాఠ్యాంశాల బోధనపై, కొమురవెల్లి మండలం మర్రిముచ్చాలలోని రైతువేదికలో కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు బుధవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి డీడబ్ల్యూవో, చేర్యాల సీడీపీవో శారద హాజరై మాట్లాడారు. శిక్షణలో పొందిన అవగాహనతో సమర్థవంతంగా ప్రీ స్కూల్స్ నిర్వహించి నూతన విద్యావిధానం అమలు విజయవంతానికి పాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు పావణి, నాగమణి, మాధవి, ఇందిర, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్ట్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి'

చేర్యాల, జూలై 3: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో మునిసిపాలిటీలలో పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ కోరారు. చేర్యాల పట్టణంలో బుధవారం నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో పారిశుధ్య కార్మికులకు రూ.21వేల వేతనం చెల్లిస్తున్నారని, ఇక్కడ కూడా అమలుచేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఇప్పకాయల శోభ, రాళ్లబండి భాస్కర్, సంతోశ్, యాదయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల10న స్పాట్ అడ్మిషన్స్

వర్గల్, జులై 3: వర్గల్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 10న స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు బుధవారం తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులలో ఖాళీ సీట్ల భర్తీకి జులై 4వ తేది నుంచి 8వ తేది వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. జులై 10వ తేదిన మెరిట్, రిజర్వేషన్‌ల ప్రకారం ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకుని జులై 10వ తేదిన ఒరిజినల్ సర్టిఫికేట్స్, మూడు జతల జిరాక్స్ ప్రతులు, పదిహేను పాస్ ఫొటోలు, రూ. 2425 నగదు రుసుము చెల్లించవలసి ఉంటుందన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

మిరుదొడ్డి, జూలై 3: ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ కొండ ప్రశాంత్ డిమాండ్ చేశారు. బుధవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడారు. నీట్, నెట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్రప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న బోధన రుసుములు, ఉపకార వేతనాల బకాయిలను చెల్లించాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూల్ చేసే యాజమన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా స్టూడెట్స్ బ్లాక్ నాయకులు కుమార్, రాజు, సాయి తదితరులున్నారు.

ఎమ్మెల్యే సొంత డబ్బుతో మట్టి రోడ్డుకు మరమ్మతు

బెజ్జంకి, జూలై 3: మండలంలోని వడ్లూరు నుంచి కొండాపూర్ వెళ్లే మట్టి రోడ్డు గుంతలు పడి వాహనదారులకు ఇబ్బందిగా ఉందని స్థానిక నాయకులు మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం ఎమ్మెల్యే సత్యనారాయణ తన సొంత డబ్బుతో మట్టి రోడ్డుకు మరమ్మతులు చేయించారు.

డైయిరీ పార్లర్ ప్రారంభం

చేర్యాల, జూలై 3: చేర్యాల పట్టణంలో కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డైరీ పార్లర్‌ను బుధవారం డైరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్ రావు ప్రారంభించారు. కార్యక్రమంలో కేసరి మల్లేశం పాల్గొన్నారు.

మహిళకు రూ.25వేల జరిమానా

మద్దూరు, జూలై 3: గుడుంబా అమ్మకాలు జరుపుతూ బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు దూళిమిట్ట మండలం చర్చితండకు చెందిన ఓ మహిళకు రూ.25వేలు జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పోలీస్ కానిస్టేబుల్ సస్పెన్షన్

సిద్దిపేట క్రైం, జూలై 3: సిద్దిపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ ముస్తఫా అనే కానిస్టేబుల్ క్రమశిక్షణ రాహిత్యంగా, పోలీస్‌శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వ్యవహరించినందుకు సీపీ బి.అనురాధ సస్పెండ్ చేశారు. బుధవారం సీపీ అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మూతపడిన పాఠశాల పునఃప్రారంభం



పాఠశాల వద్ద విద్యార్థులతో డీఈవో శ్రీనివాసరెడ్డి

బెజ్జంకి, జూలై 3: మండలంలోని పోతారం గ్రామంలో విద్యార్థులు లేక సుమారు 15 సంవత్సరాల క్రితం మూతపడిన పాఠశాలను బుధవారం డీఈవో శ్రీనివాసరెడ్డి పునఃప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మప్ప, సెక్టోరల్ అధికారి భాస్కర్, ఎంపీవో విష్ణు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి రేణుక, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యాన్ని అందించాలి

● ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి

గజ్వేల్, జూలై 3: వైద్యులు ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలో నూతనంగా నిర్మించిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా సమయంలో అద్భుతమైన సేవలను ప్రపంచవ్యాప్తంగా వైద్యులు అందించారన్నారు. వారితో నరేశ్‌బాబు, పెంటాచారి, మల్లయ్య, జూనియర్, సీనియర్ డాక్టర్లు ఉన్నారు.

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

● ఏఈవో ప్రణిత



పంటల వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో ప్రణిత

హుస్నాబాద్‌రూరల్, జూలై 3: పంటలు సాగు చేసిన రైతులు ఏఏ పంటలు సాగు చేశారనేది ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, అందుకోసం రైతులు సాగు చేసిన పంటల వివరాలను సంబంధిత రైతు వేదికలో తమకు అందజేయాలని ఏఈవో ప్రణిత పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మహ్మదాపూర్‌లో పంటల వివరాలను తెలుసుకున్నారు.

ఈజీఎస్ పనుల పరిశీలన

నంగునూరు, జూలై 3: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న వనమహోత్సవంలో భాగంగా బుధవారం డీఆర్‌డీవో పీడీ జయదేవ్ ఆర్య నంగునూరు గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం హార్టికల్చర్ ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతుల పొలాలను సందర్శించి పనులను పరిశీలించారు. రైతులు త్రివేణి, సంతోష్‌రెడ్డిలను పనుల చేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో ఏపీవో ప్రభాకర్‌రావు, ఏపీఎం లింగం, పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, టీఏలు శ్రీనివాస్, కొండల్‌రెడ్డి, కనకరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ నరసింగరావు, కారోబార్ అశోక్‌కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సెర్ప్ సిబ్బందికి మహిళా శక్తి అంశాలపై అవగాహన

హుస్నాబాద్, జూలై 3: హుస్నాబాద్ పట్టణంలోని టీటీసీ భవన్‌లో బుధవారం మూడు మండలాల సెర్ప్ సిబ్బందికి స్త్రీ శక్తి పథకంలోని 16 రకాల అంశాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అదనపు డీఆర్‌డీవో తోట మధుసూదన్ మాట్లాడుతూ.. స్త్రీ శక్తిలోని అంశాలను గ్రామాల్లోని మహిళా సంఘాలకు వివరించి లబ్ధి పొందేలా చైతన్యం పరచాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కర్ణాకర్, వాసుదేవ్, ఏపీఎం జి. శ్రీనివాస్, హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల సీసీలు, అకౌంటెంట్లు, ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమునాల ఆధారంగా పోషక యాజమాన్యం చేపట్టాలి

● కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూలై 3: మట్టి నమునాల ఆధారంగా పోషక యాజమాన్యం చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం వ్యవసాయశాఖ, ఈజీవీఎఫ్-కృషి విజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు మట్టి నమునా పరీక్షా విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గజ్వేల్ వ్యవసాయశాఖ ఏడీ బాబునాయక్ మట్టి నమునా సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, మట్టి నమూనా పరీక్షల వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. అలాగే మట్టి నమునా పరీక్షా ఫలితాల ఆధారంగా వివిధ పంటల్లో పోషక యాజమాన్యం చేసుకోవాలని సూచించారు. అనంతరం శాస్త్రవేత్త ఎన్.ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. నేలలో ఉన్న భూసారాన్ని తెలుసుకోవడం ఎంతో అవసరమని, దీంతో ఎరువుల వాడకంలో అదనపు ఖర్చులు చేయకుండా అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. వారితో ఏఈవో గణేశ్‌గౌడ్, ఎంఈవో సునీత, పాఠశాల కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి, ప్రిన్సిపాల్ విజయపాల్‌రెడ్డి, రాయప్ప తదితరులు ఉన్నారు.



మట్టి నమునాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తూతూమంత్రంగా అభిప్రాయ సేకరణ

● రైతులు రాకుండానే నిర్వహణ

మిరుదొడ్డి, జూలై 3: రైతు భరోసా పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణను బుధవారం మిరుదొడ్డిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద తూతూమంత్రంగా నిర్వహించారు. రైతు భరోసా ప్రజాభిప్రాయ సేకరణకు రైతులు రాకుండానే అధికారులు నిర్వహించడం పట్ల రైతులు అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు సమాచారం అందించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యహరించారు. రైతులకు, ప్రజలకు తెలియకుండానే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల రైతులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌పై అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు

చేర్యాల, జూలై 3: చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సర్వేశ్వర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్, అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి బుధవారం సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌కు ఫిర్యాదు చేశారు. కళాశాల బృందం ఇటీవల జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కలిసి రాజకీయం చేయడం తగదని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయంలో కుంకుమ పూజలు

హుస్నాబాద్‌రూరల్, జూలై 3: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయంలో బుధవారం భక్తులు కుంకుమ పూజ చేసి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ పూజారులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలిని కోరారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం

మద్దూరు, జూలై 3: మద్దూరు మండలకేంద్రంలోని రామాలయంలో బుధవారం వార్షికోత్సవాన్ని వైభవంగా జరిపారు. సీతారాముల కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో అర్చకులు పానుగంటి తిరుపతయ్య, ఈవో ఉప్పల రామనాథం, కె.జనార్ధన్‌రెడ్డి, బుస్సా బాలయ్య, జగదీశ్వర్, గౌరీశంకర్, బిక్షమయ్య, శంకర్, మల్లేశం పాల్గొన్నారు.

వాహనాల విస్తృత తనిఖీ

చేర్యాల, జూలై 3: కొమురవెల్లి మండలంలోని రసూలాబాద్ శివారులో ఎస్ఐ రాజుగౌడ్ ఆధ్వర్యంలో విస్తృతంగా వాహన తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని సూచించారు. నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల భిక్షాటన



వర్గల్: మైలారంలో భిక్షాటన చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

వర్గల్, జులై 3: వర్గల్ మండలం మైలారంలో ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో బుధవారం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికులు ఎల్లయ్య మాట్లాడుతూ.. ఆరు నెలలుగా తమకు జీతాలు ఇవ్వలేదని, దాంతో కుటుంబపోషణ కష్టమైయిందని, ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే జీతాలు చెల్లించాలన్నారు. లేని పక్షంలో తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనవెంట గ్రామపంచాయతీ కార్మికులు సాయి, ఎల్లం, మల్లు పోచయ్య తదితరులు ఉన్నారు.

● **గజ్వేల్:** గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఐఓసీ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు నిరసన తెలిపిన అనంతరం ఐఓసీలో భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామపంచాయతీ కార్మికులకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నెలలుగా గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వారితో నాయకులు రంగారెడ్డి, బాల్‌రాజు ఉన్నారు.

● **హుస్నాబాద్‌రూరల్:** గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి కోరారు. బుధవారం పంచాయతీ కార్మికులతో కలిసి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రభుత్వం అని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు.



పంచాయతీ కార్మికులతో కలిసి హుస్నాబాద్ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న మల్లికార్జున్‌రెడ్డి